క్లుప్తంగా

శివరాత్రి... భలే గిరాకీ



కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న పండ్ల దుకాణాలు

కడ్తాల్: శివరాత్రి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు కొనుగోలు దారులతో కిక్కిరిసి పోయాయి. రోడ్లన్నీ రద్దీగా మారాయి. శివరాత్రిని పురస్కరించుకుని ఉప వాస దీక్షలు చేపట్టిన భక్తులు.. పండ్లను సాయంత్రం ఫలహారంగా తీసుకుంటారు. దీనిని అవకాశంగా తీసుకున్న వ్యాపారులు ఫలాల ధరలను అమాంతం పెంచేశారు. అయినప్పటికీ భక్తజనం తమకు కావాల్సిన పండ్లను కొనుగోలు చేశారు. వ్యాపారులకు లాభాల పంట పండించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో యాదీలాల్ దంపతులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయం, పాత శివాలయం, మండల పరిధి కోనాపూర్ గ్రామంలో ఊరగుట్ట శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆయా ఆలయాల్లో అర్చకులు, ఆలయాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఊరగుట్ట శివాలయంలో జరిగిన ఉత్సవంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాదీలాల్ దంపతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాంచందర్

షాద్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం షాద్‌నగర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ రాంచందర్ ప్రారంభించారు. సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దర్గా వెంకటేశ్, ఆవ జగన్, మహిపాల్‌రెడ్డి, నాని, రోహన్, సూర్య, కార్తీక్, శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల ధరలకు రెక్కలు



ప్రత్యేకంగా వెలిసిన పండ్ల దుకాణాలు

చేవెళ్ల: మహా శివరాత్రి సందర్భంగా పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. మండల కేంద్రంలో రెండురోజుల క్రితం వరకు తక్కువగా ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగిపోవటంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రజలు ఉపవాస దీక్షలను విడిచేందుకు పండ్లు కొనుగోలు చేస్తుంటారు. దీంతో పండ్ల వ్యాపారం జోరుగా సాగింది. వ్యాపారులు సైతం తమకు పండుగ సీజన్ కావటంతో మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని దీంతో ఇక్కడ అవే ధరలు అమ్ముతున్నామని అంటున్నారు.

దేవాలయానికి సౌండ్ సిస్టం అందజేత

షాద్‌నగర్: పట్టణంలోని సాయిబాబా కాలనీలో ఉన్న శివమారుతీ దేవాలయానికి కాలనీకి చెందిన శివకుమార్ సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు శివకుమార్‌ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సెక్రటరీ రామకృష్ణ యాదవ్, కోశాధికారి వెంకటయ్య, గౌరవాధ్యక్షుడు క్రాంతి కుమార్, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, సమన్వయకర్త వెంకన్నబాబు, సలహాదారుడు న్యాయవాది చంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



యాచారం: నందివనపర్తి నందీశ్వరాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు



ఆమనగల్లు: అయ్యసాగరం దేవాలయంలో పూజలు చేస్తున్న టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



మంచాల: ఆరుట్లలో శివ పార్వతుల కల్యాణం

శంభో శివశంకర



ఇబ్రహీంపట్నం: నాగలింగేశ్వర సన్నిధిలో..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివ నామస్మరణతో పుణ్యక్షేత్రాల పరిసరాలు మారుమోగాయి. పరమేశ్వరున్ని దర్శించుకునేందుకు వేకువ జామునుంచే శైవాలయాలకు సాధారణ భక్తులతో పాటు, వైఐపీలు బారులు తీరారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: నాగలింగేశ్వర దేవాలయంలో భక్తుల క్యూ



ఆమనగల్లు: మంగళపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



యాచారం: నందివనపర్తి సిద్ధేశ్వరాలయంలో.. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



మాడ్గుల: కోల్కులపల్లి రామలింగేశ్వర స్వామి సన్నిధిలో హోమం



అబ్దుల్లాపూర్‌మెట్: గౌరెల్లి గుట్టపై శివపార్వతుల కల్యాణం

నూతన నియామకం

మంచాల: కాంగ్రెస్ పార్టీ నోముల గ్రామం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లాటి రవీందర్, కార్యదర్శిగా ఇంద్రారెడ్డి, యూత్‌కమిటీ అధ్యక్షుడిగా మాద రమోని హరీశ్, కార్యదర్శిగా రమేష్‌ను నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్తమయ్య, మల్లేశ్, జయానందం, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, జంగయ్య, జైపాల్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి గవర్నమెంట్ ప్రెస్ కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీలో అంతర్గత రహదారులు, వీధిదీపాలు, తాగునీరు, డ్రైనేజీ సమస్యల గురించి కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో దేవేందర్, విజయ్‌కుమార్, జితేందర్‌రెడ్డి ఉన్నారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

వైభవంగా కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి శివాలయంలో కొలువైన కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. రథోత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలీ, నాయకులు అరుణ్‌కుమార్, భాస్కర్‌నాయక్, హీరాసింగ్, జవహర్‌లాల్, కృష్ణనాయక్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. స్వామివారిని ఆమనగల్లు సివిల్ కోర్టు జడ్జీ స్వరూప కాటం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

'గమ్మత్తు' రాజకీయాలు

- ఆగని ఆశావహుల ప్రయత్నాలు
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా హడావుడి
- ఓటర్లను ఆకట్టుకునేందుకు దావత్‌లు!

మంచాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం ఆశావహులు గ్రామాల్లో పోటాపోటీగా విందులు వినోదాలతో హడావుడి చేస్తున్నారు. ప్రభుత్వం పలుమార్లు ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నామని చెప్పడం తప్ప, ఖచ్చితమైన షెడ్యూల్ ప్రకటించలేదు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా.. పోటీకి సిద్ధంగా ఉండాలని రాజకీయ పార్టీలు కూడా కార్యకర్తలకు పిలుపు నిచ్చాయి. దీంతో గ్రామాల్లో నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ముమ్మర యత్నాలు చేస్తున్నారు.

స్పష్టత లేకపోయినా..

స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ఒక్కో పార్టీకి, ఒక్కో గ్రామంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున ముందుకు వస్తున్నారు. ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాలేదు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించలేదు. అభ్యర్థులు ఎవరు అనే అంశం పై రాజకీయ పార్టీలు కూడా స్పష్టత ఇవ్వలేని పరిస్థితి. అయినా గ్రామాల్లో పోటీ పడి ఆశావహులు ఓటర్లను ఆకట్టుకోవడానికి దావత్‌ల పేరుతో మత్తులో ముంచెత్తుతున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున్న ఖర్చు పెట్టడంతో ఎంత తొందరగా ఎన్నికలు వస్తాయోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.



జాపాల గ్రామ పంచాయతీ కార్యాలయం

కాలయాపన..

గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసి ఏడాది దాటింది. 2024 ఫిబ్రవరి 2న ముగిసినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అదే విధంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసి 7నెలలు దాటింది. గతంలో ఏ ప్రభుత్వం ఇంత ఆలస్యం చేయలేదని, బీసీ కులగణన పేరుతో ప్రస్తుత ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదని ప్రతి పక్షాలు ఆరోపిస్తున్నాయి.

ప్రజా సమస్యలు గాలికి

గ్రామాల్లో ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడు లేడు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. వారు పన్నుల వసూలు చేయడం, సర్వేలు చేయడంలో తలమునకలయ్యారు. ప్రజాప్రతినిధులు ఉంటే మా గోడు వినిపించుకునే వారని గ్రామస్తులు వాపోతున్నారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలి

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మొయినాబాద్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా మండల నాయకులతో కలిసి బుధవారం నగరంలోని సబితారెడ్డి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా మహాశివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేసినప్పుడే గెలుపు సాధ్యమవుతుందని సూచించారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు ముదిగొండ శ్రీహరియాదవ్, ముదిగొండ రవియాదవ్, మక్తాల సురేందర్‌గౌడ్, శ్రీరామ్‌నగర్ కృష్ణారెడ్డి, పరమేశ్, ప్రసాద్, జెల్లల మల్లేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబితాఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండల నాయకులు

కమనీయం.. మల్లన్న కల్యాణం

- వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు
- ఉత్సవంలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామం మల్లప్పగుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం అర్చకుల నేతృత్వంలో చుక్కాపూర్ గ్రామానికి చెందిన ప్రియాంక, పాండురంగారెడ్డి, గౌరి శ్రీనివాస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగాయి. ఉత్సవంలో ముఖ్య అతిథిలుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి: స్పీకర్

ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. ప్రకృతి సిద్ధంగా వెలసిన మల్లప్పగుట్ట ఆలయ అభివృద్ధికి తనతో పాటు ఎమ్మెల్యే కసిరెడ్డి కృషి చేస్తారని స్పీకర్ చెప్పారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడానికి ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ యాటగీత, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, ఆలయ కమిటీ చైర్మన్ కౌసల్య, అధ్యక్షుడు పాండయ్య, కార్యదర్శి మల్లారెడ్డి, అడ్వైజర్ శేఖర్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ స్వప్న, నాయకులు పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజలింగం, ప్రభాకర్‌రెడ్డి, అజీం తదితరులు పాల్గొన్నారు.



భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి సన్నిధిలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మైసిగండిలో కాశీనాథుడి ఉత్సవాలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి శివాలయంలో కొలువైన కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, గణపతి హోమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలీ, రమావత్ భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, కృష్ణ వేద పండితులు ఉన్నారు.

ఏక్వాయిపల్లిలో మల్లన్న జాతర



మల్లన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు

కడ్తాల్: మండల పరిధి ఏక్వాయిపల్లి గ్రామ సమీపంలో వెలసిన మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మల్లన్న ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జైపాల్‌ను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఆలయ ధర్మకర్త ఎట్టయ్య యాదవ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్ వినోద్, నాయకులు నర్సింహారెడ్డి, గోపాల్, శేఖర్, భాస్కర్‌రావు, మహేశ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కొడంగల్: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు బుధవారం కొడంగల్‌లో తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.6వేల కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. డాబీఆర్ అంబేడ్కర్ చౌరస్తాను విస్తరిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు ప్రభుత్వం రూ.344 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి తాను అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ ఉన్నారు.

విద్యార్థులకు అండగా మాధవరెడ్డి ఫౌండేషన్

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషిచేస్తామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2024 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కలిగిన 11 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం చెక్కులను ఆయన అందజేశారు. అంతకు ముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క జంగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు టి.యాదిశ్, తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, పంచి పెట్టారు. గతేడాది పదోతరగతిలో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులకు జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులను ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయిరెడ్డిగూడలో మల్లన్న కల్యాణం

షాబాద్: మండల పరిధి లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సాయిరెడ్డిగూడలో గురువారం మల్లన్న కేతమ్మల కల్యాణానికి సర్వం సిద్ధం చేసినట్లు దేవాలయ నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, గోపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 12 గంటలకు బోనాల ఊరేగింపు, మధ్యాహ్నం మల్లన్న, కేతమ్మల కల్యాణం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కాంతారెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారని తెలిపారు.